


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### దేవుడా నీకు దిక్కెవరు?

పూర్వం పాండురంగ మహత్యం చూసాం.. సతీ సక్కుబాయి చూసాం.. భక్తతుకారాం చూసాం.. అన్నింట్లోనూ భక్తులు కడతేరిపోయేటన్ని కష్టాలు పడ్డాకా, ఆఖరి సీన్లో శంఖు చక్రాలతో, పక్కన తామరతూడు వయ్యారంగా పట్టుకున్న లక్ష్మీదేవితో భగవంతుడు ప్రత్యక్షమవడం చూసాం. ఇది చూసి చిన్నప్పుడు భవానీ వాళ్ళింట్లో నేనూ మంజూ, మా తెల్ల చిట్టీ కూడా ఘోరంగా తపస్సు చేసాం. లెఖ్ఖల టీచర్కి కడుపు నెప్పి వచ్చి లెక్కల పరీక్ష కేన్సిల్ అవ్వాలని! మా తపస్సుకి మెచ్చి దేవుడు ప్రత్యక్షం అవుతాడేమోనని తలుపులూ, కిటికీలూ తెరిచే ఉంచాలని పెద్దవాళ్ళతో పేచీ పడేవాళ్ళం. నాకైతే కళ్ళు మూసుకుని పద్మాసనం వేసుకుని కూర్చున్న కాసేపటికే, చుట్టూ పాముపుట్టలొచ్చేస్తాయేమోనని అనుమానంగా ఉండేది. - అప్పుడు చూసిన సినిమాల్లో అలా పాట పూర్తి అయ్యే లోపల చుట్టూ పాముపుట్టలొచ్చేసేవి మరి!

ఒక్కోసారి దేవుడి కిరీటం, శంఖం, చక్రం లేకుండా సాధువు రూపంలో, బిచ్చగాడి రూపంలో, చిన్నపిల్లాడి రూపంలో కూడా వచ్చేవాడని చందమామ కథల్లో చదివి, ఏ ముష్టివాడొచ్చినా గుప్పెళ్ళతో బియ్యం వేసి లెఖ్ఖల టీచర్ కడుపు నొప్పి విషయం ప్రస్తావించేవాళ్ళం.

ఇలా తెలీని ఒక అజ్ఞానంలో, అమాయకత్వంలో మేం పడి కొట్టుకుపోతుంటే మా గోపాల్గారు లాంటి హేతువాదులు కొంతమంది టీ.వీ.ల్లో 'మేటర్ కెనాట్ బీ డిస్ట్రాయిడ్. నార్ క్రియేటడ్" అని చిన్నప్పుడు సైన్స్ పుస్తకాల్లో చదువుకోలేదా? గాల్లోంచి ఉంగరాలు, శివలింగాలూ తీస్తే ఎలా నమ్మేస్తారు? అని ఈమధ్యన తెగ కేకలేస్తున్నారు. 'అంగీలో పట్టే ఉంగరాలు, శివలింగాలు. గొలుసులూ కాదు, ఆయన అంగీలో పట్టని గుమ్మడికాయలూ, టీ.వీ సెట్లూ, దానిలోంచి తీసిచూపెట్టమనండి అని అప్పట్లోనే ఛాలెంజ్ చేసాం.' అంటారు.

మరి మా బామ్మ హరనాధ బాబా భజన చేస్తుంటే ఆయన నైవేద్యం పెట్టిన కోవా బిళ్ళలు మాయం చేసేవాడని మురిసిపోయింది. కానీ ఒకసారి వెండి గ్లాసు మాయం అయ్యేసరికి ఖంగుతింది. చాలా మంది పుట్టపర్తి నుండి వచ్చి బాబాగారు గాల్లోంచి తీసి మంగళ సూత్రాలిచ్చారు.. ఉంగరాలు ఇచ్చారు, పతకాలు ఇచ్చారూ అని నాకు చూపించారు కూడా.

హేతువాదులు ఇవన్నీ కొట్టిపారేస్తారు. సరే.... వాళ్ళ గొడవ వదిలి పెడితే మనకి ముక్కోటి దేవతలున్నారు. వాళ్ళు కాక పోలేరమ్మా, కట్టమైసమ్మా ఇత్యాది గ్రామ దేవతలుంటారు. ఏ కష్టం వచ్చినా ఒక మొక్కూ... ఏ నొప్పి వచ్చినా ఒక ముడుపూ, భక్తులు

ఈజీగా కట్టుకుంటారు. డబ్బు ఖర్చు లేకుండా కొంతమంది పొర్లుదండాలూ, కేశఖండనాలూ, ప్రదక్షిణాలూ కూడా మొక్కుకోవచ్చు! ఇందులో కొందరు దేవుళ్ళూ, కొన్ని స్థలాలూ ఒక్కో పనికి ఫేమస్‌గా ఉంటాయి. రావులపాలెం దగ్గర ర్యాలి వెళితే ట్రాన్స్‌ఫర్ మొక్కులు తీరతాయి... చిలుకూరు బాలాజీ దగ్గరకి వెళితే 'వీసా'లొస్తాయి అని నమ్మకం!

ఈ మధ్య చిలుకూరులో ప్రదక్షిణాలన్నీ ఒకేసారి చెయ్యక్కర్లేదు. నూట ఎనిమిది మొక్కుకుంటే, రెండుసార్లు కింద చెయ్యచ్చూ.. అని ఆ పూజారి చెపుతున్నారు! భగవంతుడు భక్తసులభుడు.. పైగా నోరూ వాయీలేనివాడు. పది ఇన్‌స్టాల్‌మెంట్లలో చేస్తాం అన్నా ఏమైనా అంటాడా? అనగలడా? అనలేడు! నోరు తెరవడు! అసలు ఎవరి మీద కోపం వచ్చినా, ఏ పని ఆగిపోయినా, ఇంట్లో ఏ రోగం వచ్చినా ఆంజనేయస్వామికి అర్జెంటుగా అప్పాలు పోసీ, వినాయకుడికి ఉండ్రాళ్ళు పోసీ వాళ్ళు అది తిన్నారో లేదో చూడకుండా 'నీకు అది చేసా ఇది చేసా.. నాకింకా రోగం తగ్గించలేదని' తెగ ఆడిపోసుకుంటాం. పాపం..! వాళ్ళు మాత్రం రోజుకి ఎంతమంది విన్నపాలని స్వీకరించి పరిష్కరించగలరూ? గవర్నమెంటు పగలూ, రాత్రీ ఎక్స్‌ట్రా సిబ్బందిని వేసి, కంప్యూటర్స్ ఇచ్చి పనిచేయిస్తున్నా. మూడు నెలలయింది ఫోటోలు తీసి, ఇంకా ఆధార్ కార్డులే మాకు రాలేదు. పాస్ పోర్టులో మా చిన్నాడి పేరు కృష్ణకాంత్ అని టెన్త్ సరిఫికెట్‌లో చూసి కూడా కళ్ళు మూసుకుపోయినట్లు ఆ పాస్ పోర్ట్ ఆఫీస్‌లో 'ఖాన్.. కృష్ణ' అని వేసారు! ఇంక వీడు ప్రతి చోటా "మై నేం ఈజ్ ఖాన్.. బట్ ఐ యామ్ నాట్ ఎ టెర్రరిస్ట్" అని చెప్పుకు తిరగాలేమో అని నేను హడలి చచ్చా. అలా అని నేమ్ కరెక్షన్‌కి అప్లై చేస్తే నాలుగు నెలలు అయింది.. అతీ గతీ లేదు! పాపం... గవర్నమెంట్ ఆఫీసుల్లో జీతాలు తీసుకుంటూ కూడా వాళ్ళు అంత తీరిక లేకుండా ఉన్నప్పుడు.. మన దేవుళ్ళు పగలూ, రాత్రీ ప్రతి మూలనుండీ భక్తులు కోరే కోర్కెలూ, విన్నపాలూ, మురిపాలూ ఎంత గమ్మున తీరుద్దామన్నా కుదరక కాలయాపన జరుగుతూనే ఉంటుంది.

అయినా సరే చిన్నప్పటి నుండి నటరత్న ఎన్.టి.ఆర్ సినిమాల ప్రభావం వల్ల మాకు భక్తి బాగా వంటబట్టి, దేవుడుకి పూజలూ, నైవేద్యాలూ, మొక్కులూ అన్నీ టైమ్‌లీ చేస్తూ శఠగోపం పెట్టినప్పుడల్లా కోరికలు కోరుకుంటూనే ఉన్నామా!? అసలు తెలుగువాడికి తెలిసినన్ని పురాణాలు ఇంకెవరికీ తెలియదు. ఆ ఘనత మన సీనియర్ ఎన్.టి.ఆర్ దే ఆయన సీక్వెల్‌గా సినిమాలు తీయడం వల్ల కదూ మనకి కృష్ణుడి భాగవతం ఆ రాముడి రామాయణం పాండవుల భారతం క్షుణ్ణంగా వంటబట్టింది. అందుకే అమితా బచ్చన్ కౌన్ బనేగా కరోడ్ పతిలో పురాణాల గురించి ప్రశ్నలు వేస్తే మన తెలుగువాడు టకటకా సమాధానాలు చెపుతాడు. మిగతావాళ్ళు వెర్రిమొహాలు వేస్తారు. నటరత్న నందమూరి రామారావుగారే లేకపోతే మనకి రాముడెవరో, కృష్ణుడెవరో తెలిసేది కాదు. ఇంత భక్తి జరిగేది కాదు.

ఈ మధ్య మన సినిమా వాళ్ళు కాస్తా ఈ నమ్మకాలకి గండి కొడుతూ సినిమాలు తియ్యడం స్టార్ట్ చేసారు.

భగవంతుడు మనని రక్షించడం కాదు. ఆయన్నే మానవుడు రక్షించాల్సిన పరిస్థితి వచ్చిందని నిరూపిస్తూ 'శక్తి', 'బద్రీనాథ్' లాంటి సినిమాలు తీసారు. దాంతో మాలాంటి వాళ్ళకి యమా కన్‌ఫ్యూజన్ వచ్చేసింది! ఇదేవిటీ? ఒక మానవుడు క్షేత్రపాలకుడా.. ఏదో గ్రామదేవతలు క్షేత్రపాలకులు కదా! శైవక్షేత్రాలకి వైష్ణవ దేవుళ్ళూ, వైష్ణవ ఆలయాలకూ శైవ దేవుళ్ళూ క్షేత్ర పాలకులుగా విగ్రహాలని చూసాం. వాళ్ళల్లో వాళ్ళు కొట్టుకు చావకుండా.. ఆ రోజుల్లో ఈ ఆచారం పాటించారు. మన తిరుపతికి 'రుద్రుడు' క్షేత్రపాలకుడు! ఇలాంటిది సడెన్‌గా ఒక హీరో దేవుళ్ళని రక్షించడానికి కత్తి పట్టి తుపాకీలని సైతం ఆ కత్తితో ఖండిస్తూ (కూరగాయలు తరిగినట్లు తరిగేస్తూ) చెలరేగి డాన్స్ చెయ్యడం, శక్తి పీఠాలని రక్షించడానికి చిన్న ఎన్.టి.ఆర్ పూనుకోవడం.. ఇవన్నీ చూస్తే సీనియర్ ఎన్.టి.ఆర్ అయిన మన అన్నగారు స్వర్గంలో ఎంతగా 'అచ్చెరువొందుతారో!' కదా.

అసలు సినిమాలో విలన్లనీ, వాళ్ళ దుశ్చర్యలనీ చూస్తూ, ఆ దేవుడు నిమ్మకి నీరెత్తినట్లు ఉండడమే విచిత్రంగా ఉంటే, ఆ దేవుడినే తీసి పెకిలిస్తుంటే, ఓ పిల్ల హీరో చెయ్యి చేసుకుని రక్షించాల్సి వస్తోంది! అంతే గాక, టీ.వీ పెడితే 'తిరుపతిని రక్షించుకుందాం' లేక ఇంకో 'శ్రీశైలంలో లింగాలు కరిగిపోతున్నాయి ... కెమికల్స్ పూసి రక్షించండి' అంటూ ఒకటే గోల! ఇక మన బెజవాడ కనకదుర్గమ్మ

నగలైతే ఎవరూ కాపాడలేకపోయారు. వడ్డీకాసులువాడి డాలర్లన్నీ అక్కడ ఓ పెద్దాయనకి కైంకర్యం అయ్యాయని విన్నాం! ఇవి కాక చిన్నా, చితకా నగలు అమ్మవారి దగ్గరా, గోవిందరాజుల స్వామి వారి గుడిలో అస్తమానం పోయి ఆ చోట రోల్డ్‌గోల్డ్ నగలు ప్రత్యక్షం అవుతున్నాయట!

ఇవన్నీ కాక, కనిపించే దేవుడుగా ప్రసిద్ధి కెక్కిన మా సత్యసాయిబాబాగారికి అనారోగ్యం చేస్తే కాపాడలేదనీ, రాంగ్ ట్రీట్‌మెంట్ ఇచ్చారనీ, ఆయన రక్తసంబధీకులు గోల పెడుతున్నారు! అంతేకాదు.. ఆయన అక్కడున్న ట్రస్ట్ సభ్యుల చేతిలో బందీగా మారి చివర చివర్న ఏ ప్రజోపకార కార్యమూ చెయ్యలేక పోయారనీ, వాళ్ళు ఏం చేసినా కదలక మెదలక బొమ్మలా ఉండి, ఆ దుశ్చర్యలు చూడలేక ఇక తనువు చాలించారనీ కూడా అంటున్నారు. నిన్నటికినిన్న ప్రెస్ మీట్‌లో ఆ ట్రస్టు సభ్యులు యజుర్‌మందిరంలో దొరికిన 11 కోట్ల రూపాయలు కిలోల కొద్దీ బంగారం, వజ్రాలూ ఆయనెప్పుడు తీసుకున్నాడో మాకు తెలియదు ఎవరి దగ్గర తీసుకున్నాడో అంతకన్నా తెలియదు మా ట్రస్ట్‌కి జమకట్టలేదు. అని పోయిన బాబాగారి మీద దొంగతనం నేరం మోపి చేతులు దులిపేసుకున్నారు.

ఇలా భగవంతుడికే దిక్కులేకపోతే మనం మన మొరలని ఎవరికి చెప్పుకోవాలీ?

ఎక్కడో ముక్కు మూసుకుని ఆసనాలు వేస్తూ, పతంజలీ ఆశ్రమం కట్టుకున్న రాందేవ్ బాబా, స్విస్ బ్యాంకుల్లో దాచుకున్న, దోచుకున్న, నల్ల డబ్బు బయటకి తియ్యమంటే, అర్ధరాత్రి పూట.. ఒంటి నిండా బట్టలైనా లేని, బక్క పలుచని ప్రాణి అని చూడకుండా, ఏ ఆశాలేని సన్యాసినిలు అనైనా చూడకుండా లాఠీ చార్జీ చేసి అమానుషంగా దీక్ష ఆపుచేయించారు. చాలామంది 'అసలు సన్యాసులకి పాలిటిక్స్ ఎందుకటా?' అన్నారు.

'అయ్యా.. అనాదికాలం నుండి అరాచకాలొచ్చినప్పుడూ, దేశంలో కరువుకాటకాలూ, అక్రమాలూ జరిగినప్పుడు, మన పురాణాల్లో సైతం, ముక్కుమూసుకుని తపస్సు చేసుకునే వాల్మీకిలూ, వసిష్టులూ, వ్యాసమహర్షులూ రంగప్రవేశం చేసి యజ్ఞ యాగాదులు నిర్వర్తించలేదా? మహరాజులకి తగు సూచనలూ సలహాలూ, తరుణోపాయాలూ ఇవ్వలేదా? వాళ్ళని ఇలాగే తన్నారా? పాపం.. ఆ రాజ్‌బాలా అన్న సన్యాసినికి నడుం కింద నుండి పక్షవాతం వచ్చేసిందట! అసలు.. అన్యాయాల్ని ప్రశ్నించడానికి 'అన్నా హజారే', 'రాందేవ్ బాబా'లొస్తే, ముందు వాళ్ళ ఇన్‌కం టాక్స్ లెక్కలూ, ఆస్తుల వివరాలూ అడిగి, వాళ్ళే కరప్ట్ అనో, కరెక్ట్ కారనో తీర్మానం చేసి నోరుమూయిస్తారు!

**సాక్షాత్తూ కళ్ళకున్న నామాలు తీసి శ్రీవెంకటేశ్వరుడే వచ్చినా.. ముందు మెడలో ఉన్న ఆ వజ్ర వైఢూర్యాల లెక్కలు చెప్పు.. నీ గుడికి బంగారు తాపడం, నీ భార్యకి ఏడువారాల నగలూ ఏం చేసి సంపాదించావు? అని అడగడానికి అధికారులు రెడీగా ఉంటారు! ఇదే ప్రశ్న అధికారుల ఇళ్ళల్లో నల్ల డబ్బు దొరికినప్పుడు మనం ప్రశ్నించకూడదు**

**ఈ పరిస్థితుల్లో మన దేశాన్ని ప్రజల్ని, న్యాయాన్ని రక్షించే దేవుడేడి?**

'దేవతలారా కాపాడండీ..

చెడు దృష్టేమీ పడనీయకండీ..'

అనే పాటలు మార్చి,


'మన దేవతలని కాపాడుకుందాం..

పొలిటిషియన్ల దృష్టి పడనీయకుండా' అని పాడుకోవాలి!

**ధర్మో రక్షతి రక్షతః**

●●●

**Click here to share your comments on this serial**




గత మూడేళ్ళుగా 'కౌముది' పాఠకుల్ని అలరిస్తున్న 'కాలమ్ దాటని కబుర్లు' పుస్తకరూపంలో వచ్చేసింది. వెల 60రూ. మాత్రమే. ఆంధ్రప్రదేశ్ లోని అన్ని ప్రధాన బుక్ షాప్స్‌లోనూ లభిస్తుంది.